క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి, కాశిందేవిపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో నేడు(శనివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సాయి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ లైన్, సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం



ఏటూరునాగారం: మండలంలోని చిన్న బోయినపల్లి పంచాయతీ పరిధిలోని చింతలమోరికి చెందిన రవ్వ సుక్కే 108 వాహనంలో గురువారం రాత్రి డెలవరీ అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుక్కేకు పురటినొప్పులు రావడంతో 108కు సమాచారం అందజేశారు. గొత్తికోయగూడెం అడవీ ప్రాంతంలో ఉండడంతో పూర్తిగా చీకటి మయం, రోడ్డు లేని కారణంగా గర్భిణిని గూడెం నుంచి రోడ్డుపైకి వచ్చే వరకు రెండు గంటలపాటు అల్లాడిపోయారు. ఈ క్రమంలో 108 వాహనం రావడంతో అందులో తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఈఎంటీ శివలింగప్రసాద్, పైలెట్ రాజేశ్వర్, ఆశ వర్కర్ సరస్వతి సమయస్ఫూర్తి పాటించి డెలవరీ చేశారు. అనంతరం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

19 మంది గైర్హాజరు

వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు శుక్రవారం 19 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. 149 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 130 మంది మాత్రమే వచ్చి నట్లు కళాశాల ప్రిన్స్‌పల్ విజయ్ కుమార్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ములుగు: జిల్లా కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఒజ్జల మల్లక్క(106) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్, సర్వర్ చారిట్రబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ అధ్యక్షురాలు తస్లీమా మహ్మద్ కుటుంబాన్ని పరామర్శించారు, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం'

కాటారం: టీఎస్‌పీఎస్సీ కమిషన్ ప్రభుత్వంతో కుమ్మక్కై నిరుద్యోగ జీవితాలతో చెలగాటమాడుతుందని ఎస్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివసాయికృష్ణారెడ్డి ఆరోపించారు. కాటారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో అధికార పార్టీ పెద్దల హస్తం ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ సిబ్బంది డబ్బులకు కక్కుర్తిపడి పేపర్ లీక్ చేయడం సిగ్గుచేటన్నారు. పేపర్ లీక్, పరీక్ష రద్దు వరుస పరిణామాలతో నిరుద్యోగులంతా తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని అన్నారు.

'రాజకీయ కక్షతోనే రోడ్డు సర్వేలో మార్పు'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జాతీయ రహదారి 353(సీ) రోడ్డు మార్గాన్ని రాజకీయ కక్షతోనే రోడ్డు సర్వేలో మార్పులు చేశారని దళిత రైతులు ఆరోపించారు. శుక్రవారం రైతులు మాట్లాడుతూ.. గతంలో జాతీయ రహదారి గురించి మూడు సర్వేలను ఎన్‌హెచ్ ఇంజనీర్లు, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. పూర్వపు రహదారి వెంట, ముక్తివనం పార్కు గుండా, సబ్‌స్టేషన్ నుంచి దళిత రైతుల పంట భూముల నుంచి సర్వేలు చేశారన్నారు. అధికారులు పూర్వపు రహదారి ప్రకారం జాతీయ రహదారి నిర్మాణం చేయడానికి 80శాతం వరకు రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల యజమానులు అంగీకరించారని, మిగితా వారు నిరాకరించారని తెలిపారు. అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి మార్పులు చేశారన్నారు. కాగా, మళ్లీ దళితులు భూములను లాక్కోవడానికి కాళేశ్వరం, కాటారాలకు చెందిన రాజకీయ నాయకులు రోడ్డు సర్వేలను నిలిపివేశారని తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. తమ భూములు ఇవ్వమని, ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు పేర్కొన్నారు. పూర్వపు రహదారి లేదా ముక్తివనం పార్కు మీదుగా అయినా రోడ్డు నిర్మాణం చేయాలని తెలిపారు. రైతులు రెవెల్లి ఊశాలు, వెంకటస్వామి, బందెల వెంకటయ్య, లేతకరి వెంకటి, రెవెల్లి అంకయ్య ఉన్నారు.

వెంకటాపురం(కె): మిర్చి రాశులపై ఉన్న టార్పాలిన్లపై నిలిచిన వర్షం నీరు



వాజేడు: గాలికి ఒరిగిన మిర్చి తోట



చెడగొట్టు వాన

- రెండురోజులుగా కురుస్తున్న చిరుజల్లులు
- ఆందోళనలో మిర్చి రైతులు



ఏటూరునాగారం: ఓడవాడలో..



వెంకటాపురం(కె): కల్లాలో తడిసిన మిర్చిని ఆరబోస్తున్న రైతులు



మల్లూరులో మిర్చి తడవకుండా కప్పిన టార్పాలిన్

ఏటూరునాగారం/వెంకటాపురం(కె)/వాజేడు/మంగపేట: చెడగొట్టు వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పలుచోట్ల గురు, శుక్రవారాలు రెండు రోజులుగా వర్షం పడుతుండడంతో మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన ఏటూరునాగారం, వెంకటాపురం(కె), వాజేడు, మంగపేట పరిసర ప్రాంతాల రైతులు మిర్చి పంటను అధికంగా సాగు చేశారు. పంట కోత దశకు రావడంతో కొంతమంది రైతులు మిర్చిని కోసి గోదావరీలో ఆరబెట్టారు. మరికొంతమంది తోటల సమీపంలోనే కల్లాల్లో ఆరబెట్టారు. అకాల వర్షం కారణంగా కల్లాల వద్దకు టార్పాలిన్లతో పరుగులు పెడుతూ పంటను రక్షించుకుంటున్నారు. అయినా పలువురి రైతుల మిర్చి తడిసిన పరిస్థితి ఉంది. దీంతో ఆ పంటను మళ్లీ ఆరబెడుతున్నారు. గాలి దుమారం కారణంగా పలుచోట్ల మిర్చి తోటలతో పాటు మొక్కజొన్న పంట పక్కకు ఒరుగుతున్న పరిస్థితి ఉంది. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నష్టం జరుగుతుండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం



సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

ములుగు రూరల్: రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలో శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన విజయోత్సవ సంబురాలకు భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి విజయం చారిత్రాత్మకమని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై ఉపాధ్యాయులకు ఉన్న వ్యతిరేకత బయటపడిందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీలతో నిరుద్యోగ యువత భవిష్యత్‌ను గందరగోళంలో నెట్టివేశారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించి బీజేపీకి మద్దతు తెలుపాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, భూక్య రాజునాయక్, భూక్య జవహర్‌లాల్, రవీంద్రాచారి, మహేందర్, కొండారెడ్డి, రవిరెడ్డి, రాకేష్‌రెడ్డి, సురేందర్, ప్రమోద్, రంజిత్ ఉన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): గ్రూప్ 1 ప్రిలిమ్స్ పేపర్ లీకేజి కారణంగా ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శాంతియుతంగా చేస్తున్న నిరాహార దీక్షను అడ్డుకొని అరెస్టు చేయటం సరికాదని బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం సిద్ధార్థ పూలే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఎస్పీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పేపర్ లీక్ చేసి రూ.కోట్లు దండుకున్న వారిని అరెస్టు చేయకుండా తెలంగాణలో ఉన్న నిరుద్యోగులకోసం దీక్ష చేస్తున్న ప్రవీణ్‌ను అరెస్టు చేయాటం ప్రభుత్వ సిగ్గుమాలిన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాటి ధనాకర్, మండల కార్యదర్శి యాసం వెంకటేష్, నాయకులు ఆనంద్, అర్జున్, కన్నయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని భూపతి సాంబమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, రూ.2 వేల నగదును శుక్రవారం అందజేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్ 25 కేజీల బియ్యం అందజేశారు. మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా హోటల్ నిర్వహిస్తూ అందరితో కలివిడిగా ఉండే సాంబమూర్తి స్మృతులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలేటి ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య, నాయకులు లక్ష్మణ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



టేకుమట్ల: మాట్లాడుతున్న వైద్యాధికారి ఆశాజ్యోతి

టేకుమట్ల: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, అధ్యక్షతన క్షయ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. టీబీ నివారణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచిత పరీక్షలతో పాటు, మందులను సైతం అందిస్తారని, టీబీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్, ఏఎన్ఎం సంగీత, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంగీతరాణి, టీబీ సూపర్‌వైజర్ రవీంద్రనాయక్, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహదేవపూర్: టీబీని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులకు టీబీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. మనిషి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఒకరికి ఈ వ్యాధి సంక్రమిస్తుందని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరము, బరువు తగ్గడం, దగ్గినప్పుడు తేమడ రావడం జరిగితే టీబీ వ్యాధి బారిన పడినట్లు నిర్ధారించుకోవచ్చని అన్నారు. ఆరు నెలల మందులు వాడితే తగ్గుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ శ్రీపతి బాపు, నాగుల లక్ష్మారెడ్డి ఎంపీటీసీ రేవెళ్లి మమత, జయశ్రీ, ఎంపీఓ ప్రసాద్, ఏపీఎం రవీందర్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ స్వామి ఉన్నారు.

నేడు జన చైతన్య యాత్ర



మాట్లాడుతున్న అమ్జద్‌పాషా

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు(శనివారం) జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటలకు జన చైతన్య యాత్ర కార్యక్రమం జరుగుతుందని ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, గఫూర్, రవీందర్, రవి, రమేష్, రవితేజ, స్వామి, శివకేశవ్ పాల్గొన్నారు.

చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఈశ్వర్‌చందు

ఏటూరునాగారం: డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన అందె సాంబశివుడికి మల్లూరు శ్రీలక్ష్మి నరసింహదత్త సేన ఆధ్వర్యంలో రూ.5వేలను శుక్రవారం అందజేశారు. డయాలసిస్ చేసుకోవడానికి 15 రోజుల పాటు ఆస్పత్రికి వెళ్లి రావాల్సి ఉంటుందని తమ సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందజేసినట్లు మల్లూరు అర్చకులు ఏడునూతుల ఈశ్వర్‌చంద్ తెలిపారు. బాధితుడికి కుటుంబ పోషణ భారంగా ఉందని ఎవరైనా దాత లుంటే 73824 26523 ఫోన్ పే చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందు, నరేష్, సతీష్, కోటి, చిరంజీవి, సునీల్, దామోదర్, బాబు, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లితో పాటు మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు నూతనంగా నిర్మించుకుంటున్న పెద్దతల్లి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ పాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ఎఫ్ఎల్ఎన్ ఎంఎన్ఓ మండల రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగయ్య పాల్గొన్నారు.

ఇంటింటా స్వచ్ఛ భారత్ మిషన్ సర్వే



వాడగూడెంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మంగపేట: మండలంలోని స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం)కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాడగూడెం పంచాయతీలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వం స్వచ్‌భారత్ మిషన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. నివాస గృహాలు, జనావాసాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు ఇంకుడు గుంతల వినియోగం, తడి పొడి చెత్త, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, కిచన్ గార్డెన్‌ల ఏర్పాటు వాటి వినియోగంపై ప్రజలు అవగాహన కల్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ రహీమున్నీసాబేగం, మాలతో రాజు, షరీఫ్‌ఉన్నీసా, ఎంపీఓ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఎం చరణ్ రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ



స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న రాజేష్‌కుమార్

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం గిరిజన ప్రైమరీ పాఠశాల(జీపీఎస్) పాఠశాలలోని విద్యార్థులకు హెచ్ఎం జబ్బ రవి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ అంకిత్ చొరవతో విద్యార్థులకు అందించిన స్కూలు బ్యాగులు, బూట్లు, సాక్సులు, స్పోర్ట్స్ డ్రెస్‌లను మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండి ఆయా లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల స్వయంకృషి కలిగి చదివితే విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు భాగ్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

ఏటూరునాగారం: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శివాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం చేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంక దేవేందర్, బీఆర్ఎస్ నాయకులు కొత్తపల్లి వెంకన్న, మిటకంటి సమ్మయ్య, దాసరి రాజు, బండి మల్లేష్, సామ రవి, కనుకుల సదానందం, మోకాళ్ల రంజిత్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న సత్యనారాయణరావు

టేకుమట్ల(రేగొండ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయరావు అన్నారు. శుక్రవారం రేగొండ మండలంలోని కొత్తపేట(బి), రావులపల్లి, రామగుండాలపల్లి, జగ్గయ్యపేట, తిరుమలగిరి గ్రామాల్లో మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో హాథ్ సేహాథ్ జోడో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని నమ్మబలికి అధికారం చేజిక్కుకుని ఇప్పటి వరకు డబుల్ బెడ్రూంలను అందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లే దర్శనమిస్తున్నాయని అన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ బడా కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనపై ప్రజలు విసుగు చెందారని, రానున్న రోజుల్లో నిరంత పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ పట్నాలు



టేకుమట్ల: ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద భక్తులు

టేకుమట్ల: ఎల్లమ్మతల్లి సల్లంగ చూడమ్మ అంటూ భారీగా తరలివచ్చిన భక్తజనం బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని రాఘవరెడ్డిపేట మావునాల ఎల్లమ్మతల్లి ఆలయంలో ప్రతీ ఏట నిర్వహించే ఎల్లమ్మ పట్నాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి గ్రామస్తులు డప్పు చప్పుళ్ల నడుమ బోనాలతో ఆలయానికి చేరుకుని ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు ఎల్లమ్మ పట్నాలను వేసి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అశేష జనవాహిని మధ్య ఎల్లమ్మ పట్నాలు, బోనాల జాతర అత్యంత వైభవంగా కొనసాగింది. ఆలయంలో కొనసాగే బోనాలు, పట్నాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల ఆధ్వర్యంలో జాతర ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మోతె రాజమౌళి, శాస్త్రాల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కత్తి సంపత్, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, ఆలయ కమిటీ చైర్మన్ వంగ ప్రభాకర్, రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి సర్పంచ్ చదువు మధు రమహేందర్, గజ్జి సుజాతరమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

చిట్యాల: మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామస్తులు శుక్రవారం ఘనంగా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించి బోనాలను సమర్పించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ముందస్తుగా మహిళలు, పిల్లలు కలిసి డప్పు చప్పుళ్లతో పోచమ్మ గుడి వద్దకు బోనాలను తీసుకెళ్లారు. పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.